డివైడర్‌కు ఢీకొని ఒకరి మృతి

శ్రీరాంపూర్, డిసెంబర్ 19 : శ్రీరాంపూర్ ఏరియా జీఎం ఆఫీస్ సమీప జాతీయ రహదారి రింగ్ రోడ్డుపై మోటార్ సైకిల్ అదుపు తప్పిన ప్రమాదంలో పర్సెక్కి యాదవరావు (45) అక్కడికక్కడే మృతి చెందగా, అతని భార్య సుజాతకు తీవ్ర గాయాలయ్యాయి. ఎస్ఐ రాజేశ్ తెలిపిన వివరాల ప్రకారం..గోదావరిఖని వకీల్ పల్లె గనిలో పనిచేస్తున్న యాదవరావు 8ఇంక్లైన్ కాలనీ నుంచి తన మోటార్ సైకిల్‌పై భార్యతో కలిసి వస్తుండగా శ్రీరాంపూర్ జీఎం ఆఫీస్ రింగ్‌రోడ్డుపై అదుపు తప్పి అటుగా ఉన్న సైడ్ డివైడర్‌ను ఢీకొన్నారు. దీంతో యాదవరావు తలకు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందాడన్నారు. మోటార్ సైకిల్‌పై వెనక కూర్చున్న భార్య సుజాతకు చేతులకు, కాళ్లకు తీవ్ర గాయాలయ్యాయని తెలిపారు. యాదవరావు తిర్యాని మండ లం బోదర గ్రామ నివాసి కాగా వకీల్‌పల్లి గనిలో పని చేస్తున్నారు. ఇతనికి ఇద్దరు కుమారులున్నారని పేర్కొన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామన్నారు.

గోడను ఢీకొని లారీ డ్రైవర్ మృతి

చెన్నూర్ రూరల్, డిసెంబర్ 19: చెన్నూర్ మండలంలోని కొమ్మెర గ్రామంలో లారీ అదుపుతప్పి లారీ డ్రైవర్ సుబ్బారావు (48)మృతి చెందాడు. కొమ్మెర గ్రామంలోని ధాన్యం కొనుగోలు కేంద్రానికి మంచిర్యాల నుంచి ధాన్యాన్ని ఇందారం లోని మిల్లుకు తరలించేందుకు మంగళవారం కొమ్మెరలోని కొనుగోలు కేంద్రానికి వస్తుండగా లారీ అదుపు తప్పి రోడ్డు పక్కన ఉన్న గోడను ఢీకొని లారీ డ్రైవర్ సుబ్బారావు అక్కడికక్కడే మృతి చెందినట్లు ఎస్ఐ వెంకటేశ్వర్ తెలిపారు. డ్రైవర్ నిర్లక్ష్యంతోనే ప్రమాదం జరిగినట్లు పోలీసులు గుర్తించారు. మృతుడి పూర్తి వివరాలు సేకరిస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం డ్రైవర్ మృతదేహాన్ని చెన్నూర్‌లోని సర్కార్ దవాఖానకు తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వాసుదేవరావు తెలిపారు.

నేడు డబ్ల్యూపీఎస్‌జీఏ వార్షికోత్సవం

శ్రీరాంపూర్, డిసెంబర్ 19 : ఈ నెల 20న బుధవారం శ్రీరాంపూర్ కాలనీ ప్రగతీ స్టేడియం సీఈఆర్ క్లబ్‌లో సాయంత్రం 4.30 గంటలకు శ్రీరాంపూర్ ఏరియా వర్క్‌పీపుల్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ అసోసియేషన్ (డబ్ల్యూపీఎస్‌జీఏ) 2023-2024 వార్షికోత్సవం నిర్వహించనున్నట్లు డీవైజీఎం (పర్సనల్) అరవిందరావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వార్షికోత్సవానికి జీఎం సంజీవరెడ్డి హాజరవుతారని తెలిపారు. వార్షిక క్రీడా పోటీల విజేతలకు బహుమతి ప్రదానోత్సవం, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రీరాంపూర్ ఏరియా కార్మికులు, క్రీడాకారులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

ఉపాధిహామీ గ్రామసభలు

వేమనపల్లి, డిసెంబర్ 19 : మండలంలోని సుంపుటం, కల్లెంపల్లి గ్రామాల్లో మంగళవారం సర్పంచ్‌లు బాపు, పద్మల ఆధ్వర్యంలో ఉపాధి హామీ గ్రామసభలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీవో సత్య ప్రసాద్ మాట్లాడుతూ 2024-25 సంవత్సరానికి పంచాయతీల లేబర్ బడ్జెట్‌ను రూపొందించామని, సుంపుటం పంచాయతీకి రూ. 42 లక్షలు, కల్లెంపల్లి పంచాయతీకి రూ. 19 లక్షలు నిర్ణయించినట్లు తెలిపారు. గ్రామపంచాయతీల్లో కొత్త పనులకు ఎంపిక చేసి కూలీలకు పెద్ద సంఖ్యలో పనులు కల్పిస్తామని తెలిపారు. సింగిల్ విండో చైర్మన్ కుబిడె వెంకటేశం, టీఏ కృష్ణ మోహన్, కూలీలు పాల్గొన్నారు.

ఇంటి పన్నులు చెల్లించాలి

చెన్నూర్ రూరల్, డిసెంబర్ 19: చెన్నూర్ మండలంలోని గ్రామపంచాయతీలలో ఇంటి పన్నులు చెల్లించి గ్రామ అభివృద్ధికి సహకరించాలని చెన్నూర్ ఎంపీడీవో శ్రీనివాస్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామపంచాయతీ సెక్రటరీకి ఇంటి పన్నులు సకాలంలో చెల్లించి రసీదును పొంది, కార్యదర్శికి సహకరించాలని కోరారు. అదే విధంగా ప్రతి రోజూ గ్రామాల్లో పంచాయతీ కార్మికులు పారిశుధ్య పనులు చేపడుతున్నారని, తడి చెత్త పొడి చెత్తను రోజూ సేకరిస్తున్నారని తెలిపారు. ప్రతి ఒక్కరూ ఇంటిపరిసరాల్లో సేకరించిన చెత్తను వేరు చేసి జీపీ ట్రాక్టర్‌లో వేయాలని ఆయన తెలిపారు.

కార్మిక హక్కుల కోసం నిరంతరం పోరాడుతున్న

టీబీజీకేఎస్‌నే గెలిపించండి

- సింగరేణి ఎన్నికలను యథావిధిగా కొనసాగించాలి
- టీబీజీకేఎస్ ఏరియా వైస్ ప్రెసిడెంట్ మల్రాజు శ్రీనివాసరావు

తాండూర్, డిసెంబర్ 19 : సింగరేణి కార్మికుల హక్కుల రక్షణ కోసం నిరంతరం పోరాడేది తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘంతోనే సాధ్యమని, ఎన్నికల్లో ఆదరించాలని ఆ సంఘం బెల్లంపల్లి ఏరియా వైస్ ప్రెసిడెంట్ మల్రాజు శ్రీనివాసరావు అన్నారు. మంగళవారం మాదారం డిస్పెన్సరీ తోపాటు సివిల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన గేట్ మీటింగ్‌లలో ఆయన కార్మికులతో మాట్లాడారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత ముఖ్యమంత్రి కేసీఆర్ చొరవతో వారసత్వ ఉద్యోగాలు, వడ్డీ లేకుండా ఇంటి రుణం కార్మిక క్వార్టర్లలో ఏసీలకు అనుమతితో పాటు కార్మికుల సంక్షేమానికి ఎన్నో పథకాలను తీసుకురావడంతో పాటు సమస్యలను కూడా పరిష్కరిస్తామని తెలిపారు. జాతీయ కార్మిక సంఘాల నాయకుల మాటలు నమ్మి మోసపోవద్దని ఈ ఎన్నికల్లో బాణం గుర్తుకు ఓటు వేసి టీబీజీకేఎస్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. సింగరేణి ఎన్నికలను వాయిదా వేయవద్దని, ఈ నెల 27న నిర్వహించాలని టీబీజీకేఎస్ తరపున డిమాండ్ చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో టీబీజీకేఎస్ సెంట్రల్ చీఫ్ ఆర్గనైజింగ్ కార్యదర్శి సంగెం ప్రకాశ్ రావు, కార్పొరేట్ చర్చల ప్రతినిధి ధరావత్ మంగీలాల్, జీఎం కమిటీ సభ్యులు కోగిలాల రవీందర్, ఏరియా అసిస్టెంట్ కార్యదర్శి కుమార స్వామి, మాదారం డిస్పెన్సరీ ఇన్‌చార్జి ప్రశాంత్, అబ్బాపూర్ ఓపెన్ కాస్ట్ పిట్ కార్యదర్శి బూర శ్రీనివాస్, ఓరం కిరణ్, సివిల్ డిపార్ట్మెంట్ పిట్ కార్యదర్శి గుజ్జా శ్రీనివాస్, శివానంద చారి తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న టీబీజీకేఎస్ ఏరియా వైస్ ప్రెసిడెంట్ శ్రీనివాసరావు

విద్యార్థులకు ప్రత్యేక బస్సులు నడపండి

- ఆర్టీసీ అధికారులకు బీఆర్ఎస్ నాయకుల వినతి

కంట్రోలర్‌కు వినతి పత్రం ఇస్తున్న బీఆర్ఎస్ నాయకులు

చెన్నూర్, డిసెంబర్ 19: గ్రామాల నుంచి వచ్చే విద్యార్థులకు సమయానుకులంగా ప్రత్యేక బస్సులను నడపాలని ఆర్టీసీ అధికారులను బీఆర్ఎస్ నాయకులు కోరారు. ఈ మేరకు చెన్నూర్ బస్టాండ్‌లో మంగళవారం కంట్రోలర్ కిషన్‌కు వారు వినతి పత్రం అందజేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించడంతో బస్సులన్నీ రద్దీతో పోతున్నాయని, చెన్నూర్‌లోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, డిగ్రీ కళాశాల, కోటపల్లిలోని మోడల్ పాఠశాల, జూనియర్ కళాశాల విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. పరీక్షల దృష్ట్యా ప్రత్యేక బస్సులు నడపాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సాధనబోయిన కృష్ణ, బీఆర్ఎస్ నాయకులు చకినారపు రాజేశ్, తుమ్మ రాజలింగు, ఎనగందుల ప్రశాంత్, కామిడి సతీశ్, నెన్నల భీమ య్య, ఆత్రం రాకేశ్, నాయకపు వినయ్, తుంగ పిండి రాజేశ్ పాల్గొన్నారు.

183మందికి కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ

జన్నారం, డిసెంబర్19: జన్నారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుపటేల్ 183 మందికి కల్యాణ లక్ష్మి చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రభుత్వం ఆడబిడ్డలకు కల్యాణలక్ష్మి చెక్కులు అందిస్తూ భరోసా అందిస్తున్నన్నారు. ఆర్టీసీలో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పిస్తున్నదన్నారు. ప్రభుత్వం అందిస్తున్న పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ మాదాడి సరోజన, జడ్పీటీసీ ఎర్ర చంద్రశేఖర్, తహసీల్దార్ వేణుగోపాల్, సింగిల్‌విండో చైర్మన్ శీలం రమేశ్, ఎండీ రియాజొద్దీన్, కరుణాకర్, తదితరులు పాల్గొన్నారు.

చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే బొజ్జు పటేల్

మహిళ లకు ప్రాధాన్యం

- మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేంసాగర్ రావు

మంచిర్యాల అర్బన్, డిసెంబర్ 19 : కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలకు పెద్దపీట వేస్తుందని మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేంసాగర్ రావు అన్నారు. మంగళ వారం తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో మహిళలకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వం హయాంలోని పథకాలన్నీ యథావిధిగా కొనసాగుతాయన్నారు. త్వరలోనే రేషన్ కార్డుల అందజేసే ప్రక్రియ మొదలు చేస్తామన్నారు. పార్టీలకతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందుతాయన్నారు. రానున్న రోజుల్లో నిరుపేద ఆడబిడ్డల పెండ్లికి లక్ష రూపాయల నగదుతో పాటు తులం బంగారం కూడా అందజేస్తామన్నారు. అనంతరం 15 మందికి కల్యాణ లక్ష్మీ, షాదీముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ కేవైప్రసాద్, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు తూముల నరేశ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు పూదరి తిరుపతి, రాష్ట్ర నాయకులు చిట్ల సత్యనారాయణ, పూదరి ప్రభాకర్, కార్యూరి చంద్రమౌళి, తహసీల్ కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

లబ్ధిదారులకు చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావు

హెల్త్ హబ్‌గా మారుస్తా..

మంచిర్యాల అర్బన్, డిసెంబర్ 19 : మంచిర్యాల జిల్లా కేంద్రాన్ని హెల్త్ హబ్‌గా మార్చి రోగులకు మైరుగైన వైద్యం అందించేందుకు కృషి చేస్తానని మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేంసాగర్‌రావు పేర్కొన్నారు. మంగళ వారం ఎమ్మెల్యే నివాస గృహంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. మంచిర్యాలలోని ఐబీ స్థలంలో నిర్మించిన మార్కెట్ కాంప్లెక్స్ భవనం మాతా శిశు దవాఖానగా మారుస్తానని స్పష్టం చేశారు. ఐటీఐ స్థలంలో సూపర్ స్పెషాల్టీ దవాఖానలను నిర్మిస్తానని, కొంత సమయం తీసుకున్నా దవాఖానల ఏర్పాటులో వెనుకడుగు వేసేది లేదని తేల్చి చెప్పారు. జిల్లాలో ఎక్కడా గంజాయి అమ్మకాలు, వినియోగం లేకుండా చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. నార్కో టీం, పోలీస్ ప్రత్యేక బృందాలతో గంజాయి రవాణా, విక్రయాలను ఆరికట్టిస్తానని తెలిపారు. బెల్ట్‌షాపులను నిషేధించాలని అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. గూడెం ఎత్తిపోతల పథకం ద్వారా సాగునీరు అందించేందుకు, చెరువులను నింపడానికి చర్యలు తీసుకున్నామన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా నాయకులు గడ్డం త్రిమూర్తి, చిట్ల సత్యనారాయణ, పట్టణ అధ్యక్షులు తూముల నరేశ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు పూదరి తిరుపతి, కౌన్సిలర్లు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి

హాజీపూర్, డిసెంబర్ 19 : జిల్లాలోని ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని ఆయన నివాసంలో జిల్లా మండల పంచాయతీ, తెలంగాణ నాన్ గెజిటెడ్ ఉద్యోగుల (టీఎన్జీవో) సంఘం నేతలు మర్యాద పూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించి పుష్పగుచ్చం అందజేశారు. ఈ సందర్భంగా జిల్లాలోని ఉద్యోగుల సమస్యలను వారికి విన్నవించారు. ఈ కార్యక్రమంలో మండల పంచాయతీ అధికారుల సంఘం అధ్యక్షుడు శ్రీపతి బాపురావు, ప్రధాన కార్యదర్శి అజ్మత్ అలీ, కోశాధికారి షేక్ సద్దర్ అలీ, వేదాల శ్రీనివాస్, సత్యనారాయణ, శ్రీనివాస్ రెడ్డి, నాగరాజు, టీఎన్జీవోస్ ఫారెస్ట్ సెంట్రల్ ఫోరం అధ్యక్షుడు పొన్న మల్లయ్య, ఉపాధ్యక్షుడు రవి కిరణ్ రెడ్డి, కాళేశ్వరం సర్కిల్ కార్యదర్శి వెంకట కృష్ణ తదితరులున్నారు.

చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలి

- అటవీ అభివృద్ధిశాఖ మంచిర్యాల డివిజనల్ మేనేజర్ శ్రావణి

క్రీడా సామగ్రి పంపిణీ చేస్తున్న అటవీశాఖ అధికారులు

జైపూర్, డిసెంబర్ 19: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని అటవీ అభివృద్ధిశాఖ మంచిర్యాల డివిజనల్ మేనేజర్ శ్రావణి అన్నారు. మంగళవారం జైపూర్ మండలంలోని ముదిగుంట గ్రామంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాలలోని విద్యార్థులకు అటవీ అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో క్రీడా సామగ్రి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సామాజిక సేవా కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు క్రీడా సామగ్రి పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులు చదువుతో పాటుగా క్రీడల్లో రాణించాలని, మానసికంగా, ఆరోగ్యపరంగా చురుకుగా ఉంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ దుగుట జ్యోతి, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రాజ్‌గోపాల్, ప్లాంటేషన్ మేనేజర్ సురేశ్‌కుమార్, అటవీ శాఖ అధికారులు లక్ష్మణ్, సునీత, సిబ్బంది శంకర్, సాయికిరణ్, షాహిద్ తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రం తనిఖీ

లక్షెట్టిపేట, డిసెంబర్ 19: లక్షెట్టిపేట మున్సిపాలిటీలోని 14వ వార్డు అంగన్‌వాడీ కేంద్రాన్ని మున్సిపల్ కమిషనర్ కల్లెడ రాజశేఖర్ మంగళవారం అకస్మికంగా తనిఖీ చేశారు. పిల్లలకు పౌష్టికాహారం సక్రమంగా అందించాలని నిర్వాహకులను సూచించారు. కేంద్రం బోర్డు లేదని వెంటనే ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఆయన వెంట వార్డు కౌన్సిలర్ చింత సువర్ణ, సిబ్బంది ఉన్నారు.

వరి కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

కన్నెపల్లి, డిసెంబర్ 19 : మండలంలోని జన్కాపూర్, మాడవెల్లి గ్రామాల్లో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను మంగళవారం ప్రజాప్రతినిధులు, అధికారులు ప్రారంభించారు. రైతులందరూ కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించి మద్దతు ధర పొందాలన్నారు. రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ సీఈవో రాజేశ్వర్‌రావు, వైస్ ఎంపీపీ రాకేశ్ శర్మ, ఏఈవో వెంకటేశ్, కాంగ్రెస్ నాయకులు మాధవరపు నర్సింగ రావు, నాయకులు నెండుగురి సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ప్రజాప్రతినిధులు

వ్యవసాయ అధికారుల సూచనలు పాటించాలి

చెన్నూర్ రూరల్, డిసెంబర్ 19: వ్యవసాయ శాఖ అధికారుల సూచనలను రైతులు పాటిస్తే పంటలలో మంచి దిగుబడులు వస్తాయని ఏఈవో సాగర్ అన్నారు. ఆస్నాద్ గ్రామంలోని రైతు వేదికలో రైతులు ఈ ఏడాది సాగు చేస్తున్న పంటల వివరాలను ఏఈవో సాగర్ నమోదు చేసుకున్నారు. రైతులు ఎన్ని రకాలలో ఏయే పంటలను సాగు చేస్తున్నారని వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం కూరగాయల తోటలను ఆయన పరిశీలించారు. జాగ్రత్తలను వివరించారు. సేంద్రియ వ్యవసాయంతో కలిగే ప్రయోజనాలను, ఆయిల్ ఫామ్ ఇతర పంటల సాగుపై రైతులకు వివరించారు. నానో యూరియా, ఎరువుల వాడకంపై రైతులకు అవగాహన కల్పించారు. రైతులు సేంద్రియ వ్యవసాయంపై దృష్టి పెట్టాలని, రసాయన ఎరువులతో భూసారం దెబ్బ తింటుందని వివరించారు. ఈ కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

అవగాహన కల్పిస్తున్న ఏఈవో సాగర్

విద్యార్థులకు నోట్‌బుక్స్, పండ్లు పంపిణీ

మందమర్రి, డిసెంబర్ 19: సీపీఐ సీనియర్ నాయకుడు భీమనాథుని ఉప్పలయ్య ఏడవ వర్ధంతి సందర్భంగా ఆయన కుమారులు మంగళవారం మందమర్రి పట్టణంలోని అంగడిబజార్ ఏరియాలో గల ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులు, సింగరేణి పాఠశాల ఆవరణలో గల మనోవికాస్ పాఠశాల విద్యార్థులకు నోట్‌బుక్స్, పండ్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ తండ్రి ఉప్పలయ్య సీపీఐలో పని చేసే సమయంలో ప్రజలకు సేవలందించారన్నారు. ఆయన జ్ఞాపకార్థం తాము విద్యార్థులకు నోట్‌బుక్స్, పండ్లను పంపిణీ చేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప్పలయ్య కుమారులు భీమనాథుని సదానందం, భీమనాథుని జనార్ధన్‌తో పాటు వారి కుటుంబ సభ్యులు, ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి బేస్ బాల్ పోటీలకు గురుకుల విద్యార్థిని..

ఎంపికైన విద్యార్థినిని సన్మానిస్తున్న అధ్యాపకులు

లక్షెట్టిపేట, డిసెంబర్ 19: లక్షెట్టిపేట పట్టణంలోని ప్రభుత్వ సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల కళాశాలకు చెందిన ప్రజ్ఞ జాతీయ స్థాయి బేస్ బాల్ పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ లలిత కుమారి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 16 నుంచి 19వ తేదీ వరకు వరకు తొర్రూర్‌లో స్కూల్ గేమ్స్ ఆఫ్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన అండర్-17 రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొని ప్రతిభ కనబర్చి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైందన్నారు. ఈ సందర్భంగా ప్రజ్ఞను కళాశాల అధ్యాపకులు, సిబ్బంది శాలువాలతో ఘనంగా సన్మానించి అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్‌తో పాటు వైస్ ప్రిన్సిపాల్ మహేశ్వర్‌రావు, పీడీ మల్లిక, పీఈటీ మమత, ఉమాదేవి, మౌనిక తదితరులు ఉన్నారు.

అంతర్ విశ్వవిద్యాలయం హ్యాండ్‌బాల్ పోటీలకు...

మంచిర్యాల అర్బన్, డిసెంబర్ 19 : అంతర్ విశ్వవిద్యాలయం హ్యాండ్ బాల్ పోటీలకు జిల్లాకు చెందిన సాంఘిక సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థిని ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ డీ సుమతి మంగళ వారం తెలిపారు. కాకతీయ యూనివర్సిటీ గ్రౌండ్స్‌లో ఈ నెల 17, 18 తేదీల్లో జరిగిన హ్యాండ్ బాల్ ఇంటర్ యూనివర్సిటీ సెలక్షన్స్‌లో సాంఘిక సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాల ఎంపీపీఎస్ తృతీయ సంవత్సరం చదువుతున్న సీహెచ్ శివాని ప్రతిభ కనబర్చి చెన్నైలోని పెరియర్ యూనివర్సిటీలో జరిగే సౌత్ జోన్ అంతర్ విశ్వవిద్యాలయం పోటీలకు ఎంపికైందన్నారు. శివానిని కళాశాల వైస్ ప్రిన్సిపాల్ కే శివలీల, పీడీ డాక్టర్ ఎన్ పద్మ, అధ్యాపకులు అభినందించారు.

శివాని

కాంట్రాక్టు కార్మికులకు సీఎంపీఎఫ్ చిట్టీలు అందజేత

సీఎంపీఎఫ్ చిట్టీలను అందిస్తున్న జీఎం సంజీవరెడ్డి

శ్రీరాంపూర్, డిసెంబర్ 19 : సింగరేణి శ్రీరాంపూర్ ఏరియాలోని కాంట్రాక్ట్ కార్మికులకు మంగళవారం జీఎం ఆఫీస్‌లో జీఎం సంజీవరెడ్డి సీఎంపీఎఫ్ చిట్టీలు అందించారు. ఈ సందర్భంగా జీఎం మాట్లాడుతూ 2022 మార్చి నాటికి జమ అయిన మొత్తాలు చూపిస్తూ సీఎంపీఎఫ్ చిట్టీలు అందించినట్లు తెలిపారు. కాంట్రాక్ట్ కార్మికులకు సీఎంపీఎఫ్ అమలు చేయడం సంతోషకరమన్నారు. కార్మికులకు ఎలాంటి సందేహాలున్నా సంబంధిత అధికారులను అడిగి వివరాలు తెలుసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ఓటూజీఎం రఘుకుమార్, ఏజీఎం మురళీధర్, డీవైజీఎం అరవిందరావు, ఆనంద్‌కుమార్, సీనియర్ సెక్యూరిటీ ఆఫీసర్ మురళీమోహన్, సీనియర్ పీవో కాంతారావు పాల్గొన్నారు.

ఆర్కేపీ సీహెచ్‌పీలో ఏఐటీయూసీ గేట్ మీటింగ్

రామకృష్ణాపూర్, డిసెంబర్ 19: ఆర్కేపీ సీహెచ్‌పీలో ఏఐటీయూసీ పిట్ కార్యదర్శి హరి రామకృష్ణ ఆధ్వర్యంలో మంగళవారం ద్వార సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా వేజ్ బోర్డు సభ్యుడు, ఏఐటీయూసీ యూనియన్ అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య కార్మికులతో మాట్లాడారు. కార్మికులకు ఏఐటీయూసీ సంఘం అనేక హక్కులు సాధించి పెట్టిందని తెలిపారు. వేజ్ బోర్డులో మెరుగైన ఒప్పందాలు చేయించిందని చెప్పారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ జనరల్ సెక్రటరీ ముస్కె సమ్మయ్య, సెంట్రల్ సెక్రటరీ అక్బర్‌అలీ, ట్రేడ్ మెన్ కమిటీ సభ్యుడు దైవ సహాయం, సీహెచ్‌పీ పిట్ కమిటీ సభ్యులు మాదాసి వేణుగోపాల్, సిరాజుద్దీన్, బొప్పదండి స్వామి, శ్రీధర్‌రావు, కృష్ణ స్వామి, మండల శ్రీనివాస్, శ్రీనివాస్ యాదవ్, ఆవుల మల్లయ్య, కనకమ్మ, రజిత, రవళి కోటేశ్వర్‌రావు, సంపత్, మేడ సంపత్ తదితరులు పాల్గొన్నారు.

ఆదాయపు పన్ను రద్దుకు కృషి చేస్తాం

శ్రీరాంపూర్, డిసెంబర్ 19 : సింగరేణి కార్మికులకు ఆదాయపు పన్ను రద్దుకు, అలవెన్స్‌లపై ఐటీ రద్దుకు కృషి చేస్తామని తెలంగాణా ఏఐటీయూసీ ఇన్‌చార్జి బోసు పేర్కొన్నారు. మంగళవారం శ్రీరాంపూర్ ఆర్కే 5, ఎస్ఆర్పీ 3 గనులపై ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఎన్నికలు వాయిదా వేయకుండా వెంటనే ఈ నెల 27న నిర్వహించాలని డిమాండ్ చేశారు. అధికార ప్రభుత్వం కాంగ్రెస్ నాయకులు ఎన్నికలు వాయిదా వేయించాలని కుట్రలు చేస్తున్నారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ప్రధాన కార్యదర్శి ముస్కె సమ్మయ్య, బ్రాంచ్ కార్యదర్శి బాజీసైదా, ఏరియా కార్యదర్శి కొమురయ్య, నాయకులు వేణుమాదవ్, ప్రసాద్‌రెడ్డి, చంద్రమోహన్, అప్రోజ్‌ఖాన్, మురళీచౌదరి, మల్లేశ్, రవి, సత్తిరెడ్డి, జీపీ రావు పాల్గొన్నారు.

ఐఎన్టీయూసీ ఆధ్వర్యంలో గేట్‌మీటింగ్

తాండూర్, డిసెంబర్ 19 : బెల్లంపల్లి ఏరియా వర్క్‌షాప్‌లో ఐఎన్టీయూసీ ఆధ్వర్యంలో మంగళవారం గేట్‌మీటింగ్ నిర్వహించారు. ఈ గేట్ మీటింగ్‌కు కేంద్ర కమిటీ ఉపాధ్యక్షుడు సిద్దంశెట్టి రాజమౌళి, జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు సూరం రవీందర్ రెడ్డి, బెల్లంపల్లి ఏరియా ఐఎన్టీయూసీ ఉపాధ్యక్షుడు పేరం శ్రీనివాస్ ముఖ్యఅతిథులుగా హాజరై కార్మికుల సమస్యలపై మాట్లాడారు. ఐఎన్టీయూసీ గుర్తింపు సంఘంగా గెలిస్తే కార్మికుడికి సొంత ఇంటి పథకం, స్థలం, రూ.20 లక్షల వడ్డీ లేని రుణం పెరిక్సైట్ ఐటీ రద్దు చేయించడం, కార్మికులకు వివిధ రకాల హక్కులు సాధించి పెట్టేందుకు ఐఎన్టీయూసీతోనే సాధ్యమని చెప్పారు. ఈ సమావేశంలో ఏరియా సెక్రటరీ మాధవ కృష్ణ, జీపీ చంద్రశేఖర్, పిట్ సెక్రటరీలు కోటేశ్వరరావు, దుండ రవికుమార్, ఏరియా నాయకులు డి సదానందం, రమేశ్, రవీందర్, పర్వీజ్, రఫీ, చంద్రశేఖర్, రాజు, రమేశ్, భీమేశ్, కార్మికులు, తదితరులు పాల్గొన్నారు

పొత్తు పెట్టుకొని గెలిచి ఆరోపించడం తగదు

శ్రీరాంపూర్, డిసెంబర్ 19 : తెలంగాణాలో సీపీఐ కాంగ్రెస్‌తో పొత్తు పెట్టుకొని ఒక్క సీటు గెలిచారని, పార్టీ అనుబంద కార్మిక సంఘం ఐఎన్‌టీయూసీపై ఏఐటీయూసీ నాయకులు విమర్శలు చేయడం సరి కాదని కేంద్ర ఉపాధ్యక్షుడు కలవేణి శ్యామ్‌కుమార్ పేర్కొన్నారు. మంగళవారం శ్రీరాంపూర్ ఎస్ఆర్పీ 1గనిపై ఏరియా ఉపాధ్యక్షుడు జే శంకర్‌రావు అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. గనులు ప్రైవేటీకరణ బిల్లును సీపీఐ నాయకులు పార్లమెంట్‌లో అడ్డుకోలేదన్నారు. కార్మికుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ద్వారా కృషి చేస్తామన్నారు.